క్లుప్తంగా

'తప్పుడు పోస్టులు పెడితే చర్యలు'

వేములవాడ: ప్రజలు, రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా వ్యక్తులను కించపరిచేలా, మనోభావాలు దెబ్బతీసేలా పోస్టులు పెట్టడం, ఒకరికొకరు వ్యక్తిగత దూషణలు చేసుకోవడం, అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని లేకపోతే చర్యలు తప్పవని టౌన్ సీఐ వీరప్రసాద్ ఆదివారం హెచ్చరించారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు చేపట్టడం, శాంతి భద్రతలకు విఘాతం కల్పించడం, ఇతరుల పరువుకు భంగం కలిగే విధంగా వ్యవహరించడంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఇప్పటికే ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూప్స్, ఎక్స్ వేదికలో షేర్ చేసినా, పోస్ట్‌చేసిన వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేశామన్నారు. మీకు ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'ఆది'కి పుష్పగుచ్ఛం అందజేత

వేములవాడ: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వేములవాడ శివారులోని అయ్యోర్‌పల్లి వాసులు శనివారం అసెంబ్లీకి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తమ ఊరిపేరు ప్రస్తావిస్తూ విప్ ఆది శ్రీనివాస్ ప్రసంగం కొనసాగిందని, తమ గ్రామాన్ని విలీన గ్రామాల నుంచి విముక్తి కల్పించిన ఆయనకు గ్రామస్తులు వెడిజ మల్లయ్య, వంగల కర్ణ, ఉల్లెందుల మల్లేశం, ఉల్లెందుల మల్లయ్య, ఉల్లెందుల రాజు, ఉల్లెందుల హన్మంతులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

నియామకం



నియామకమైన గ్రామశాఖ అధ్యక్షులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు మంద మనోహర్ ఆధ్వర్యంలో గ్రామశాఖ అధ్యక్షుల నియామకం జరిగింది. మండలంలోని అన్నిగ్రామాల నుంచి గ్రామ శాఖ అధ్యక్షులను ఆదివారం నియమించారు. కార్యక్రమంలో బీసీసంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వంగ వంశీకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి దుర్గం సురేశ్, ఉపాధ్యక్షులు వంగ మహేందర్, సంయుక్త కార్యదర్శి పెద్దపల్లి మనోజ్, కార్యవర్గ సభ్యులు చింతకుంట గౌతమ్ పాల్గొన్నారు.

కల్వర్టు చుట్టూ మట్టి తొలగిస్తాం

ముస్తాబాద్: ముస్తాబాద్–నామాపూర్ ఆర్‌అండ్‌బీ రహదారిలో కల్వర్టును మూసివేస్తూ ఉన్న మట్టిని తొలగిస్తామని ఈఈ వెంకటరమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షిలో శనివారం 'కల్వర్టు నీటికి దారేది'..? శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. త్వరలోనే కల్వర్టు చుట్టు ఉన్న మట్టిని తొలగించి, నీరు సాఫీగా వెళ్లేలా చూస్తామని పేర్కొన్నారు.

సన్మానం



శేఖర్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

తంగళ్లపల్లి: రెండోసారి యువజన కాంగ్రెస్ నియోజక వర్గం అధ్యక్షుడిగా ఎన్నికైన చుక్క రాజశేఖర్‌ను ముదిరాజ్ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, ఫిషరీస్ చైర్మన్ చొప్పరి రామచంద్రం, పిట్టల భూమేశ్, వెంకటస్వామి, పర్శ హనుమండ్లు, జంగపల్లి శేఖర్, నర్సయ్య, భద్రాచలం, శ్రీనివాస్, నరేశ్, నాగరాజు, మండలాల ముదిరాజ్ సంఘ అధ్యక్షులు, ముదిరాజ్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

'దయ..క్షమ ఇస్లాం బోధనలు'



మాట్లాడుతున్న ముఫ్తీ మౌలానా ఖలీం

వేములవాడ: దయా, క్షమ బోధించేది ఇస్లాం మత గ్రంథం ఖురాన్ అని ముఫ్తీ మౌలానా ఖలీం పేర్కొన్నారు. వేములవాడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. మానవుడి జీవన విధానాన్ని ఖురాన్ బోధిస్తుందన్నారు. దయ, క్షమ, దైవారాధనతో బతకాలని సూచించారు. అందరితో కలిసిమెలిసి జీవించాలని ఖురాన్ చెబుతుందన్నారు. పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు అక్రం, ఉపాధ్యక్షుడు అజీ మ్, కార్యదర్శి షాహిద్‌పాషా, కోశాధికారి ముషాహిద్, మసీద్ అధ్యక్షుడు షేక్ ఇమాం, మహమ్మద్ బషీర్, ముఫ్తీ హయాజుద్దీన్, మౌలానా ఆసిముద్దీన్, ఫహద్ పాషా, అంజద్ పాషా, నవాబ్‌ఖాన్, గౌస్‌బాబా, షేక్ ఆసిఫ్, సయ్యద్ అతీఖ్, షేక్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.





ముమ్మరంగా యాసంగి వరినాట్లు



చందుర్తి : మండలంలోని పలు గ్రామాల్లో యాసంగి వరినాట్లు జోరందుకున్నాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు నిండుకుండలా ఉన్నాయి. భూగర్భజలాలు పెరగడంతో మండలంలో 15,250 వేల ఎకరాల్లో యాసంగిలో వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది రైతులు ముందుగానే వరినాట్లు వేస్తున్నారు. వేసవిలో ఎండలు ముదిరి బావుల్లో భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండిపోయే అవకాశం ఉండటంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే మండలంలో 9వేల ఎకరాలకు పైగా వరినాట్లు పూర్తి కావచ్చినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు సాగుపనుల్లో బిజీగా ఉన్నారు. మహిళ కూలీలకు నాట్లు వేసేందుకు డిమాండ్ పెరిగింది.

తప్పుడు ప్రచారం మానుకోవాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చందుర్తి: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో ఇతర పార్టీలు నాయకులు గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలని కాంగ్రెస్ మండల నాయకులు హితవు పలికారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చందుర్తి –మోత్కురావుపేట రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితోనేనన్నారు. దీనిపై మేమే అటవీశాఖ అనుమతులు తీసుకొచ్చామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మండలకేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు త్వరలోనే వస్తాయని ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి ఎలాంటి అభివృద్ధి నాయకులు, ప్రజలు తమను ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో తప్పుడు ప్రచారానికి దిగుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం మానుకోవాలన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టే ప్రభాకర్, నాయకులు పులి సత్తయ్య, గసికంటి ప్రభాకర్, దేవస్వామి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన రామవ్వ యాదిలో..



బావుసాయిపేటలో పాల్గొన్న కళాకారులు

కోనరావుపేట: కోనరావుపేట మండలం బావుసాయిపేటలో ఆదివారం రాత్రి నిర్వహించిన పూరడి రామవ్వ యాదిలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రముఖ గాయకులు, రచయిత మాట్ల తిరుపతి, గజ్జల అశోక్, ఆకునూరి దేవయ్య, నక్క శ్రీకాంత్, సంజీవ్, కాయితి బాలు ఆలపించిన గీతాలు అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించాయి. బంధాలు, అనుబంధాలను గుర్తుచేస్తూ కళాకారులు పాడిన పాటలు కుటుంబ సభ్యులు, గ్రామస్తులను భావోద్వేగానికి గురిచేశాయి. కుమారులు సత్తయ్య, తిరుపతి, మల్లికార్జున్, కూతుళ్లు లచ్చవ్వ, సత్తవ్వ, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి



ఎన్నికైన నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లతిమ్మాపూర్, రాచర్లగుండారం, దుమాల, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, అక్కపల్లి గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులను ఆదివారం ఎన్నుకున్నారు. 1వ బూత్ అధ్యక్షుడిగా దీటి నర్సయ్య, 2వ బూత్ అధ్యక్షుడిగా నంది నరేశ్, 3 బూత్ నుంచి బుర్క వేణు, 4వ బూత్ నుంచి ఎండీ అబ్దుల్లా, 5 బూత్ నుంచి గంట బాల కిషన్‌గౌడ్, 6 బూత్ నుంచి మాలోత్ స్వరూప నాయక్, 7 బూత్ నుంచి అంతర్పుల తిరుపతి, 8వ బూత్ అధ్యక్షుడిగా చందుపట్ల రాంరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన బూత్ అధ్యక్షులు గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సూచించిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, నాయకులు సంగీత, రావుల గాల్‌రెడ్డి, రాజిరెడ్డి, కిరణ్‌నాయక్, దాస్, మానుక రాజుయాదవ్, రమేశ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు



వేములవాడ: పట్టణంలోని ఓల్డ్ అర్బన్‌కాలనీలోని ఎల్షద్దాయి మినిస్ట్రీస్ చర్చిలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. అనంతరం క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాస్పెల్ ప్రేయర్ హాల్ వ్యవస్థాపకుడు గోలి నర్సింహారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పాస్టర్ శ్రీకాంత్‌రెడ్డి, గోలి అరుందాస్, విశ్వాసులు గోలి రాజేందర్, బాబు, దాసు, సాలొమోను, శ్రీకాంత్, పుల్కం మధు, గోలి శ్రీనివాస్, ప్రకాశ్, సతీశ్, ప్రవీష్, కాంగ్రెస్ నాయకులు హన్మంతురెడ్డి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

ముస్తాబాద్: గ్రామస్థాయిలో బీజేపీ బూత్ కమిటీలను బలోపేతం చేస్తుందని ఆపార్టీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ అన్నారు. గూడెంలో బీజేపీ బూత్ కమిటీల నియామక సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అంజాగౌడ్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి అన్ని గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీల నియామకం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామాగ్రామాన ప్రజలకు వివరించాలన్నారు. శ్రీనివాస్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్పస్వాములు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల నుంచి అయ్యప్ప మాలధారులు ఆదివారం శబరిమలకు ప్రత్యేక బస్సులో తరలివెళ్లారు. ఇరుముడి కట్టుకొని కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్ప ఆలయానికి సుమారు వందమంది వెళ్లారు.

దత్త ఆలయానికి అప్రోచ్ రోడ్డు

- మానీటిలో వరదవెల్లి గుట్టపై ఆలయం
- రోడ్డు నిర్మాణానికి అంచనాలు
- కిలోమీటర్ మేర అప్రోచ్ రోడ్డుకు కసరత్తు
- మంత్రి పొన్నం, ఎమ్మెల్యే సత్యం చొరవతో తీరనున్న భక్తుల ఇక్కట్లు



మిడ్‌మానేరు ఈఈ జగన్‌తో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సత్యం (ఫైల్)

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి గుట్టపై స్వయంభూగా ఉన్న దత్తాత్రేయస్వామి ఆలయానికి అప్రోచ్ రోడ్డు సౌకర్యం కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఆలయానికి వెళ్లేందుకు దారి లేక భక్తులు ఇక్కట్లు పడుతున్న విషయం తెలిసిందే. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో గతంలో రోడ్డు నిర్మాణం కోసం మిడ్ మానేరు ఇంజినీరింగ్ అధికారులు ప్రాథమిక సర్వే చేసి డిజైన్ కోసం సీఈసీడీవో(చీఫ్ ఇంజినీర్ సెంట్రల్ డిజైన్స్ ఆఫీస్)కు నివేదిక పంపారు. ఇటీవల రోడ్డు డిజైన్ అనుమతులు రావడంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం అంచనాలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వారం రోజుల్లో అంచనాలు రూపొందించే పనులు పూర్తి చేసి పైఅధికారులకు నివేదిక అందించనున్నట్లు మిడ్ మానేరు ఈఈ జగన్ తెలిపారు. ఈనెల 15న దత్త జయంతి ఉత్సవాలకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దారి ఏర్పాటు విషయంలో మిడ్ మానేరు ఈఈ జగన్‌తో చర్చించారు. ఈ క్రమంలోనే అప్రోచ్ రోడ్డు అంచనాలు చేపడుతున్నారు.

కిలోమీటర్ మేర..

మధ్య మానేరు ప్రాజెక్టు పాత వరదవెల్లి గ్రామం నుంచి దత్త ఆలయం వరకు వెళ్లేందుకు కిలోమీటర్ మేర అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఇంజినీరింగ్ అధికారులు నిర్ణయించారు. మట్టితో రోడ్డు నిర్మించి రోడ్డుకు రెండువైపులా ఎత్తులో రాతి కట్టడం(రివిట్‌మెంట్) చేసే పనులు చేపట్టనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రాజెక్టులో 26 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. వేసవిలో నీటి నిల్వలు తగ్గిన అనంతరం అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిసింది. కొదురుపాక నుంచి ఫోర్‌లేన్ బ్రిడ్జి వరకు రాతి కట్టడంతో రివిట్‌మెంట్ చేసి రోడ్డు నిర్మించిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో ఇక్కడ దత్త ఆలయం రోడ్డు డిజైన్ ఉంటుందని అంటున్నారు.

ఉత్సవాలకు బోటు సౌకర్యం

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురు దత్తాత్రేయస్వామి జయంతి ఉత్సవాలు ఏటా డిసెంబర్‌లో జరుగుతాయి. ఈనెల 14 నుంచి 16 వరకు ఉత్సవాలు నిర్వహించారు. గతంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆలయానికి వెళ్లేందుకు బోటు సమకూర్చారు. జయంతి ఉత్సవాల సమయంలో ఆలయానికి వెళ్లేందుకు ప్రభుత్వం టూరిజం శాఖ ఆధ్వర్యంలో రెండు బోట్ల సౌకర్యం కల్పించారు. ఉత్సవాలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, ముంబై ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చారు.

తీరనున్న ఇబ్బందులు

మిడ్ మానేరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో ఉన్న ఆలయానికి వెళ్లేందకు గతంలో భక్తులు చాలా ఇబ్బందులు పడ్డారు. మొదట కేంద్ర మంత్రి సంజయ్ బోటు సమకూర్చడంతో కొంతమేర ఇబ్బందులు తప్పాయి. ఇప్పుడు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవతో అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనుల్లో కదలిక వచ్చింది. అంచనాలు రూపొందించాక నిధులు మంజూరు చేయనున్నారు. కొద్ది రోజుల్లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసే అవకాశముందని స్థానిక నాయకులు తెలిపారు.

మంత్రి, ఎమ్మెల్యే సహకారంతో..



దత్త ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు నిర్మించాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సత్యంకు గతేడాది ఉత్సవాల్లో భక్తులతో కలిసి విజ్ఞప్తి చేశాం. వారు స్పందించి రోడ్డు నిర్మాణానికి అంచనాలు వేసే పనులు జరుగుతున్నాయి. త్వరలో భూమిపూజ ఉంటుంది. వచ్చే ఉత్సవాల వరకు రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని మంత్రి, ఎమ్మెల్యే పేర్కొంటున్నారు.

– కూస రవీందర్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు

అంచనాలు రూపొందిస్తాం



వరదవెల్లి గురు దత్తాత్రేయస్వామి గుట్టపై ఉన్న ఆలయానికి వెళ్లేందుకు రివిట్‌మెంట్‌తో కూడిన అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం ఇంజినీరింగ్ అధికారులు ప్రాథమిక సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదికను సీఈసీడీవో వారికి డిజైన్ కోసం పంపించగా డిజైన్ ఇచ్చారు. రోడ్డు నిర్మాణం కోసం వారం రోజుల్లో అంచనాలు రూపొందించి అధికారులకు పంపిస్తాం.

– జగన్, మిడ్ మానేరు, ఈఈ



వేములవాడ: పట్టణంలోని సాయినగర్ నుంచి రెండో బైపాస్‌రోడ్డుకు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కనే ఓ ఇంటి యజమాని రోడ్డును ఆక్రమించి ర్యాంప్ నిర్మిస్తున్నాడు. దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, పలుసార్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఇదే కాలనీకి చెందిన తిరుపతితోపాటు చుట్టు పక్కల వారు ఆరోపిస్తున్నారు. వెంటనే రోడ్డుపై వరకు నిర్మిస్తున్న ర్యాంప్‌ను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
అన్వేష్, మున్సిపల్ కమిషనర్ ఫోన్ నంబర్ : 7995002848

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేములవాడరూరల్: మండలంలోని నూకలమర్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అదే పాఠశాలలో జరిగింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలకు రూ.లక్ష విరాళం అందజేసి ఉచితంగా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	0	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	03	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	1	1,008
నందీశ్వర నాన్ఏసీ	03	560
నందీశ్వర సూట్స్	0	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	05	448
పార్వతీపురం స్పెషల్	01	672
పార్వతీపురం సాధారణ	02	336

– వేములవాడ

ఏఎంసీ డైరెక్టర్ మృతి



పాడె మోస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి: బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బూర్గుపల్లికి చెందిన గంగిపెల్లి లచ్చయ్య అలియాస్ ఎమ్మెల్యే లచ్చయ్య (65) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు తిరుపతి గత జూన్‌లో దుబాయిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గంగిపెల్లి లచ్చయ్య అంతిమయాత్రలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని పాడె మోశారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, ఏఎంసీ చైర్మన్ ఎల్లేశ్‌యాదవ్, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పరామర్శించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ భార్య..



వరలక్ష్మి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్ మాజీ సర్పంచ్ లింగాల అంజాగౌడ్ సతీమణి లింగాల వరలక్ష్మి (65) ఊపిరితిత్తుల సమస్యతో ఆదివారం తెల్లావారుజామున మృతిచెందింది. ఈ సంఘటన స్వగ్రామంలో విషాదం నింపింది. కుటుంబ సభ్యులకు పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. వరలక్ష్మి కొంత కాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతోంది. ఐదు రోజుల క్రితం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తీవ్ర అస్వస్థతకు గురై మరణించింది. మృతురాలి భర్త అంజాగౌడ్ గ్రామంలో సర్పంచ్‌గా, ఉపసర్పంచ్‌గా సేవలందించారు. అంత్యక్రియల్లో మాజీ ఎంపీపీ ఎలుసాని మోహన్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ నిమ్మ మల్లారెడ్డి, నిమ్మ నారాయణరెడ్డి, గౌడ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శన



వేములవాడరూరల్: వేములవాడ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారానికి హాజరైన కళాకారుల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. రూరల్ మండలంలోని నూకలమర్రి గ్రామానికి చెందిన తీగల రాజేశంగౌడ్ బృందం చేసిన ప్రదర్శన పలువురిని అలరించింది.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

వీర్నపల్లి: రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామానికి చెందిన కోతి దేవరాజ్, అతడి భార్య భాగ్య ఆదివారం వీర్నపల్లిలో నిత్యావసర వస్తువుల కొనుగోలుకు బైక్‌పై వస్తుండగా.. బావుసింగ్‌నాయక్‌తండాకు చెందిన రామవత్ లింగం, గుగులోత్ విజయ్ వీర్నపల్లి నుంచి మద్దిమల్లకు వెళ్తున్న క్రమంలో బైక్‌తో ఢీకొట్టారు. నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.